క్లుప్తంగా

నామినేషన్ల ఉపసంహరణ

చివ్వెంల : సూర్యాపేట బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈ నెల 28న జరగనున్న నేపథ్యంలో శుక్రవారం నామినేషన్ల ఉపసంహరణ కార్యక్రమం నిర్వహించారు. ఆయా పోస్టులకు దరఖాస్తు చేసుకున్న పలువురు నామినేషన్ ఉపసంహరించుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి, ఉపాధ్యక్ష, గేమ్స్ అండ్ కల్చరల్ పోటీలకు ఎన్నికలు జరగనున్నాయి. 28న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నికలు జరుగుతాయి. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు ఓట్ల లెక్కింపు కార్యక్రమం చేపట్టి విజేతలను ప్రకటించనున్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సత్యనారాయణ



తుంగతుర్తి : తుంగతుర్తి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన న్యాయవాది తాళ్లపల్లి సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ నెల 20న న్యాయవాదుల సర్వసభ్య సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్‌గా రమావత్ పూల్‌సింగ్, నరల్ సెక్రటరీగా ఎండీ పర్వీన్, జాయింట్ సెక్రటరీగా మల్లెపాక రవికుమార్, కోశాధికారిగా బి.ప్రతాప్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తాళ్లపల్లి సత్యనారాయణ మాట్లాడారు. ప్రస్తుతం కోర్టులో రెగ్యులర్ జడ్జి లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, న్యాయవాదుల సహకారంతో ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రెగ్యులర్ జడ్జిని నియమించేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. తన ఎన్నికకు సహకరించిన తోటి న్యాయవాదులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు జిల్లా కుమారస్వామి, వజీర్, నాగరాజు, అనిల్‌కుమార్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆధ్యాత్మిక ప్రవచనం

ఆత్మకూర్(ఎస్) : మండల కేంద్రంలోని పూర్వ విద్యార్థుల సేవా సమితి భవనంలో ఆదివారం శ్రీమద్రామాయణ వైభవంపై డాక్టర్ ఓలేటి రవికుమారాచార్యచే ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించనున్నట్లు దాసాంజనేయ స్వామి భక్తబృందం సభ్యుడు నూగూరు శ్రీనివాసాచార్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని భక్తులు, పురప్రముఖులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

కుల బహిష్కరణపై విచారణ



రెడ్డిగూడెంలో విచారణ చేస్తున్న తహసీల్దార్

మద్దిరాల : రెడ్డిగూడెంలో రజక సంఘానికి చెందిన పలువురు వ్యక్తులు రజక కులానికి చెందిన తమ కుటుంబాన్ని బహిష్కరణ చేశారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక తహసీల్దార్ అమీన్‌సింగ్ రెవెన్యూ సిబ్బందితో కలిసి శుక్రవారం గ్రామంలో విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ వహీద్, సీనియర్ అసిస్టెంట్ రమణరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బీజేపీని గెలిపించడమే ప్రజల కర్తవ్యం

నూతనకల్ : ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావడం ప్రజల కర్తవ్యమని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కాప రవికుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో లా భర్తీ సంపర్క అభియాన్ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నుంచి లబ్ధిపొందిన లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి మోదీ ప్రధాని కావడం ఎంత ముఖ్యమో వారికి వివరించాలని అన్నారు. భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌ను ఎంపీగా గెలిపించడం కోసం కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మద్ది సంజీవరెడ్డి, బొల్క కుమార్, మారగాని ముత్తయ్య, మాతంగి వెంకన్న, కట్టపోలోజు వెంకటేశ్వర్లు, ముత్యం వీరబాబు, బ్రహ్మాండ్లపల్లి మధు తదితరులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

ఆత్మకూర్(ఎస్) : మండల పరిధిలోని నెమ్మికల్లు దండుమైసమ్మ ఆలయ హుండీని శుక్రవారం లెక్కించారు. 84 రోజులకు గాను 4,54,594 రూపాయల ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారి కుశలయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇన్‌స్పెక్టర్ ఎం. వెంకటలక్ష్మి, అర్చకులు సతీష్‌కుమార్, కిరణ్‌కుమార్, నాగేశ్వర్‌రావు, సైదులు, శ్రీనివాస్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కవాతు

నడిగూడెం : నడిగూడెం, సిరిపురం, వేణుగోపాలపురం గ్రామాల్లో మునగాల సీఐ రామకృష్ణారెడ్డి, నడిగూడెం ఎస్‌ఐ, సిబ్బంది.. సీఐఎస్‌ఎఫ్ బృందాలతో కలిసి శుక్రవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రామకృష్ణారెడ్డి మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రశాంత వాతావరణం కల్పించేందుకు ఈ కవాతు నిర్వహించినట్లు తెలిపారు.

అర్వపల్లిలో నీటికి కటకట

- నిలిచిపోయిన మిషన్ భగీరథ నీళ్లు
- పనిచేయని రక్షిత మంచినీటి పథకాలు



అర్వపల్లి సంతలో మట్టిలో పూడుకపోయి పనిచేయని మంచినీటి పథకం బోరు



అర్వపల్లి గ్రామపంచాయతీ ఎదుట మోటార్ లేక నిరుపయోగంగా ఉన్న బోరు

అర్వపల్లి : రెండు జాతీయ రహదారులకు ప్రధాన కూడలి అయిన అర్వపల్లిలో నీటి సమస్య ఏర్పడింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గత మూడు రోజులుగా మిషన్ భగీరథ జలాలు నిలిచిపోవడంతో సమస్య మొదలైంది. దీనికి తోడు గ్రామంలో సగం వరకు ఇళ్లకు నీళ్లందించే సంతలోని రక్షిత మంచినీటి పథకం బోరు మట్టిలో పూడిపోయింది. అయితే ఈ బోరును ఫ్రెషింగ్ చేయించాల్సి ఉంది. అలాగే కొత్తకుంటలో రెండు బోర్లు నీటిలో మునిగాయి. ఇవి పనిచేస్తే కొన్ని వీధులకు నీటి సమస్య తీరనుంది. గ్రామ పంచాయతీ ఎదుట ఉన్న బోరుకు మోటార్ లేక నిరుపయోగంగా ఉంది. పల్లె ప్రకృతి వనం పక్కన ఉన్న బోరులో నీళ్లు అడుగంటడంతో కేజీబీవీ, జెడ్పీహెచ్‌ఎస్‌లలో నీటి సమస్య ఏర్పడింది. జనగామ రోడ్డులో సాయిబాబా గుడి సమీపాన రైతు బోరును అద్దెకు తీసుకొని ఆ ప్రాంతంలో నీటి సమస్య తీర్చారు. మిగతా ప్రాంతాల్లో కూడా నీటి సమస్య పరిష్కారానికి బోర్లను ఫ్రెషింగ్ చేయించాలని, రైతులను ఒప్పించి బోర్లను అద్దెకు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. వెంటనే మిషన్ భగీరథ జలాలను కూడా పునరుద్ధరించాలని అంటున్నారు.

ఇష్టారీతిన కనెక్షన్లు..

అర్వపల్లి గ్రామంలో సుమారు 700 ఇళ్లు ఉండగా అన్ని ఇళ్లకు నల్లా కనెక్షన్‌లు ఉన్నాయి. కొన్ని ఇళ్లకు రెండు మూడు కనెక్షన్‌లు ఇచ్చారు. కొన్ని ఇళ్లకు అనధికారికంగా డైరెక్టు కనెక్షన్‌లు ఇవ్వడంతో కూడా నీటి సమస్య ఏర్పడుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రెండు రోజులుగా నిలిచిన 'భగీరథ' జలాలు

నూతనకల్ మండలం చిల్పకుంట్ల గ్రామంలోని మిషన్ భగీరథ నీటిశుద్ధి కేంద్రంలో మూడు రోజులుగా మరమ్మతు పనులు జరుగుతున్నందున పలు గ్రామాలకు మిషన్ భగీరథ జలాలు నిలిచిపోయాయి. తుంగతుర్తి నియోజకవర్గంలోని తుంగతుర్తి, నూతనకల్, మద్దిరాల, జాజిరెడ్డిగూడెం, నాగారం మండలాలకు నీళ్లు బంద్ అయ్యాయి. ఆయా మండలాల పరిధిలోని 168 గ్రామాలకు నీళ్లు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు రోజులుగా నీళ్లు రాకపోవడం, దీనికి తోడు వేసవి కావడంతో నీటి సమస్య తీవ్రమవుతోంది. చాలా గ్రామాల ప్రజలు ఈ మిషన్ భగీరథ నీళ్లపైనే ఆధారపడి ఉన్నారు. వెంటనే పనులను పూర్తి చేసి మిషన్ భగీరథ నీటిని పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేయిస్తున్నాం



అర్వపల్లిలో నెలకొన్న నీటి సమస్యను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నాం. సంతలోని రక్షిత మంచినీటి పథకం బోరు ఫ్రెషింగ్ చేయించడం కోసం బోరుబండిని తెప్పిస్తున్నాం. మిగిలిన బోర్లు కూడా పనిచేసేలా చూస్తున్నాం. శుక్రవారం అన్ని బోర్లకు మరమ్మతు చేయించినప్పటికీ సమస్య తీరలేదు.

- డి.సందీప్‌కుమార్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ

ముగిసిన అధ్యయనోత్సవాలు

- నేటి నుంచి బ్రహ్మోత్సవాలు



అధ్యయనోత్సవాల్లో పాల్గొన్న భక్తులు

సూర్యాపేట రూరల్ : మున్సిపల్ పరిధిలోని పిల్లలమర్రి శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయంలో శనివారం నుంచి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు చైర్మన్ రాజబాబురెడ్డి వెల్లడించారు. శుక్రవారం యజ్ఞాచార్యులు మరింగంటి వరదాచార్యుల ఆధ్వర్యంలో పరమపదోత్సవాలు నిర్వహించగా గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న అధ్యయనోత్సవాలు ముగిశాయి. రాత్రి గ్రామంలో తిరువీధి సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ రాజబాబురెడ్డి, వంశపారంపర్య ధర్మకర్త ఉమ్మెంతల హరిప్రసాద్‌రావు, అర్చకులు ముడుంబై రఘువరన్ ఆచార్యులు, దరూరి రాఘవాచార్యులు, గోమఠం రాఘవాచార్యులు, డైరెక్టర్లు చెరుకుపల్లి కృష్ణయ్య, మంగపండ్ల మల్లికార్జున్, కుమ్మరికుంట్ల జానయ్య, చెరుకుపల్లి సైదమ్మ, గంపల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం శివారులోని మూసీ నది నుంచి ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, ఎస్‌ఐ ఎస్‌కె. యాకూబ్ హెచ్చరించారు. ఇసుక అక్రమ రవాణా అరికట్టేందుకు రెవెన్యూ, పీఆర్, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇసుక అక్రమ రవాణా చేసే, వారికి సహాయపడే వ్యక్తుల వివరాలను సేకరిస్తున్నామని చెప్పారు. రాత్రి వేళల్లో ఇసుక అక్రమ రవాణా చేస్తే ట్రాక్టర్లను సీజ్ చేసి కేసులు పెడతామని ఆయన హెచ్చరించారు.

చివరి విడతలో గోదావరి జలాలు వచ్చేనా..

అర్వపల్లి : యాసంగి సీజన్‌కుగాను గోదావరి జలాలు వారబందీ విధానంలో శనివారం (నేటి నుంచి) రావాల్సి ఉంది. చివరి విడతగా శనివారం నుంచి ఈ నెల 30 వరకు నీటిని విడుదల చేస్తామని అధికారులు ప్రకటించారు. కానీ పైన నీటి లభ్యత తక్కువగా ఉన్నందున చివరి భూముల రైతులకు నీళ్లు అందని పరిస్థితి నెలకొంది. దీంతో నీటి పారుదల అధికారులు ఏమిచేయాలో అర్థం కాక దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రస్తుతం నీళ్లు వదలకపోతే పూర్తి స్థాయిలో పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. ఒకటి రెండు రోజుల్లో నీళ్లు వదిలేలా ప్రయత్నం చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

తాగునీటి సమస్యపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి



చివ్వెంల : ఐలాపురంలో గ్రామ పంచాయతీ బోర్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ



మద్దిరాల : రెడ్డిగూడెంలో పైపులైన్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న తహసీల్దార్, అధికారులు

చివ్వెంల : గ్రామాల్లో తాగునీటి సమస్యపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవ్ అన్నారు. శుక్రవారం ఐలాపురం, గాయంవారిగూడెం గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిశీలించి మాట్లాడారు. ఆయా గ్రామాల్లోని పంచాయతీరాజ్ బోర్లు, చేతి పంపులు, మిషన్ భగిరథ నీటి సరఫరాను పరిశీలించారు. పనిచేయని బోర్లు, చేతిపంపులకు వెంటనే రిపేర్ చేయించి, వినియోగంలోకి తీసుకురావాలని సిబ్బందికి సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్వో క్రిష్ణయ్య, ఎంపీడీఓ సంతోష్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మద్దిరాల : గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. శుక్రవారం రెడ్డిగూడెంలో వాటర్ ట్యాంకు నుంచి గ్రామానికి వేసిన మంచి నీటి పైపు లైన్ పనులను ఆయన పరిశీలించారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు ఉన్నట్లయితే స్పెషల్ ఆఫీసర్లు వాటిని వెంటనే పరిష్కరించాలని అన్నారు. అదే విధంగా మండల కేంద్రంలోని ఎంపీడీఓ సత్యనారాయణ గతంలో వేసిన బోరు మోటార్‌ను వాడకంలోకి తేవాలని, నీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్లు స్రవంతి, అఖిల్, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ జల దినోత్సవం



తిరుమలగిరి మున్సిపల్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న సిబ్బంది



చివ్వెంల : మండల పరిషత్ కార్యాలయంలో ఇంకుడుగుంతలను పరిశీలిస్తున్న అధికారులు

తిరుమలగిరి : ప్రపంచ జల దినోత్సవాన్ని తిరుమలగిరి మున్సిపల్ కార్యాలయంలో, మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ప్రతి ఒక్కరూ నీటిని సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, సిబ్బంది ఖదీర్, రాజు, అఖిల, మండల పరిషత్ కార్యాలయంలో మండల పంచాయతీ అధికారి మారయ్య, ఏపీఓ లక్ష్మి, రమేష్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంట్లో ఇంకుడుగుంతలు నిర్మించాలి

చివ్వెంల : గ్రామాల్లోని ప్రతి ఇంట్లో ఇంకుడుగుంతలు తీయించాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సీహెచ్. సంతోష్ కుమార్ అన్నారు. అంతర్జాతీయ జల దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల పరిషత్ కార్యాయలంలో ఇంకుడుగుంతలను పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుత కాలంలో నీరు చాలా విలువైందని, నీటి వృథాను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వర్షపు నీరు, ఇంట్లో వినియోగించిన నీరు వృథాగా పోకుండా ఇంట్లో ఇంకుడుగుంత తీసి దానిలో ఇంకేలా చూడాలన్నారు. దీని వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ క్రిష్ణయ్య, ఎంపీఓ టి.గోపి, ఏపీఓ నాగయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నీటి పరిరక్షణకు కృషి చేయాలి

నూతనకల్ : ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని, నీటి సంరక్షణ పాటించాలని ఎంపీడీఓ సునీత, తహసీల్దార్ శ్రీనివాసరావు కోరారు. శుక్రవారం ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని అధికారులు ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు. అలాగే ఇంకుడుగుంత నిర్మాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జలనిధి అత్యంత విలువైన సంపద అని తెలిపారు. ప్రతి నీటి బొట్టు మానవ జీవితానికి అవసరమని, నీటిని వృథా కాకుండా చూడడంలో ప్రజలను చైతన్యవంతులను చేయాలని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం తగదు



తిరుమలగిరిలో నిరసన వ్యక్తం చేస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు

తిరుమలగిరి : మనీ లాండరింగ్ ఆరోపణలపై ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్టు చేయడం తగదని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దుంపల మురళీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తిరుమలగిరిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిని కోర్టులో ఛార్జిషీట్ వేయకుండా అరెస్టు చేయడం ఇదే తొలిసారని ఆరోపించారు. ప్రతిపక్ష నాయకులపై కేంద్రంలో ఉన్న అధికార భారతీయ జనతా పార్టీ నాయకులు కేసులు పెట్టి భయాందోళనలకు గురి చేస్తున్నారని అన్నారు. నరేంద్రమోదీ పాలనను ప్రజలందరూ వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీ నాయకులను అరెస్టు చేయిస్తోందని ఆరోపించారు. సార్వత్రిక ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. సమావేశంలో దుంపల పారిజాత, చల్లా సాలయ్య, వై.సోమలక్ష్మి, వై.యాకూబ్‌రెడ్డి, నర్సింహాచారి, సావిత్రమ్మ, సందీప్, నరేష్ పాల్గొన్నారు.

నూతనకల్ : ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని సీపీఐ మండల కార్యదర్శి తొట్ల ప్రభాకర్‌గౌడ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులను అన్ని రకాలుగా ఒత్తిడికి గురిచేస్తోందని విమర్శించారు. బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతున్న రాజకీయ పార్టీల నాయకులను, ప్రజాప్రతినిధులను వివిధ రకాల కేసుల పేరుతో ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు యానాల వెంకట్‌రెడ్డి, మద్దెల రామ్మూర్తి, రవి, ఉప్పలయ్య, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి

నాగారం : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కడియం కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఇళ్ల స్థలాలు లేని వారికి ఇళ్ల స్థలాలతో పాటు ఇళ్లను మంజూరు చేయాలన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి నేటికీ అమలు చేయలేదన్నారు. అర్హులకు డబుల్‌బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలని కోరారు. వేసవిలో నీళ్లలేక వరి పంటలు ఎండిపోతున్నాయని, ప్రభుత్వం ఎస్సారెస్పీ నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు కండె భిక్షం, గుడపూరి వెంకటేశ్వర్లు, మహేందర్, పుల్లయ్య, పద్మ, వెంకన్న, స్వరూప, సైదులు పాల్గొన్నారు.

నగదు పట్టివేత



నెమ్మికల్లులో తనిఖీ చేస్తున్న పోలీసులు

ఆత్మకూర్(ఎస్) : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా నెమ్మికల్లులో శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. తనిఖీల్లో రూ.1,61,000 పట్టుబడినట్లు ఎస్‌ఐ వై. సైదులుగౌడ్ తెలిపారు. నెమ్మికల్లులో ఎర్ర వెంకన్న, ముత్యాల సైదులు, రాంబాబు నుంచి ఫ్లైయింగ్ స్క్వాడ్ ఆధ్వర్యంలో ఈ నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

విద్యార్థులకు అవగాహన

నడిగూడెం : పిల్లల అభిరుచికి అనుగుణంగా గైడెన్స్ ఇవ్వాలని కోదాడ పట్టణానికి చెందిన ఎంఎస్ విద్యా సంస్థల సీఈఓ సేకు శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో కేరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు.

బదిలీపై వెళ్లిన రైటర్‌కు సన్మానం



రమేష్‌ను సన్మానిస్తున్న ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి, సిబ్బంది

నాగారం : నాగారం పోలీస్‌స్టేషన్‌లో రైటర్‌గా పనిచేసి బదిలీపై తిరుమలగిరి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన చామల రమేష్‌ను శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి, పోలీసులు శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి మాట్లాడారు. ప్రజా సేవ చేసిన వారికి ఎల్లప్పుడూ గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది వల్కి వెంకన్న, లింగయ్య, సతీష్, నారాయణరెడ్డి, రమణ పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

అర్వపల్లి : పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ బి.అర్జున్ కోరారు. జాజిరెడ్డిగూడెంలో శుక్రవారం పశువులకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో వీఎల్‌ఓ కేఎస్‌ఎస్ పద్మ, సిబ్బంది యాదగిరి, యాకయ్య పాల్గొన్నారు.

ఉపాధి హామీలో వసతులు కరువు

- టెంట్ల ఏర్పాటులో నిర్లక్ష్యం
- ఓఆర్‌ఎస్‌లు కూడా అందుబాటులో ఉంచని అధికారులు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న కూలీలు



ఎల్లప్పకుంట తండాలో పనులు చేస్తున్న కూలీలు

పెన్‌పహాడ్ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఉపాధి హామీ పథకంలో కూలీలకు కనీస వసతులు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. రోజు రోజుకూ పెరుగుతున్న ఎండలతో ఉపాధి కూలీలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. పని ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కూడా లేని పరిస్థితి నెలకొంది.


సౌకర్యాలు కరువు..

పెన్‌పహాడ్ మండలంలో 29గ్రామ పంచాయతీలు ఉండగా 12,164 జాబ్‌కార్డులు ఉన్నాయి. 17,590 మంది కూలీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. వేసవిలో ఎలాంటి పనులు లేక చాలా మంది ఉపాధి హామీ పనులపై ఆధారపడుతున్నారు. గ్రామాల్లో ఉపాధి హామీ కూలీల హాజరు శాతం ఎక్కువగా నమోదవుతోంది. 2017 వరకు ఉపాధి కూలీలకు పలుగు, పారలు, తట్టలు ఇచ్చారు. అనంతరం వాటి సరఫరా ఆగిపోయింది. చివరకు కనీస సౌకర్యాలు కూడా కల్పించడంలేదు. వేసవిలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు సైతం కూలీలే వెంట తెచ్చుకునే పరిస్థితి నెలకొంది. సేద తీరడానికి సమీపంలోని చెట్ల వద్దకు పరుగులు తీస్తున్నారు. చెట్లు లేని చోట ఎండలోనే కూర్చుంటున్నారు.

సహాయకులు లేక ఇక్కట్లు..

కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీల్లో క్షేత్రసహాయకులు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. సీనియర్ మేటీలే పనులు చూసుకుంటున్నారు. దీంతో ఆయా పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు సరిగా సాగడం లేదు. కొన్ని చోట్ల పాత పంచాయతీల్లో పనిచేసే క్షేత్ర సహాయకులకు అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నారు. చాలా మంది కూలీలు ఆధార్ లింక్ కాక పనులు చేయలేకపోతున్నారు. దీంతో పాటు పాత జీపీల నుంచి కొత్త జీపీలకు మారడంతో కొంత మంది పేర్లు సాఫ్ట్‌వేర్‌లో రెండు చోట్ల ఉండడంతో ఆధార్ అనుసంధానం కావడం లేదు. ప్రస్తుతం వచ్చిన నూతన ఎన్‌ఐసీ సాఫ్ట్‌వేర్‌తో కూలీలకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఉన్నతాధికారులకు నివేదించాం



ఉపాధి పనుల వద్ద కూలీలకు నీడ కోసం గతంలో టెంట్లు ఏర్పాటు చేశాం. ప్రస్తుతం కూడా ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారులకు నివేదించాం. ఓఆర్‌ఎస్‌ను పంపిణీ చేసేందుకు వైద్యులకు తెలియజేశాం.

- రవి, ఏపీఓ

తాగునీటి సౌకర్యం లేదు

పని ప్రదేశంలో తాగునీరు, నీడ వంటి సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నాం. ఇంటి నుంచి నీటిని తీసుకెళ్తున్నాం. ఎండ వేడికి కొద్ది సేపటికే నీరు వేడెక్కుతోంది. తప్పనిసరి పరిస్థితుల్లో ఆ నీటినే తాగాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనీసం తాగునీరు ఏర్పాటు చేయాలి.

- అంజయ్య, చీదెళ్ల, ఉపాధి కూలీ

రూ.20వేల ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న యూత్ క్లబ్ సభ్యులు

ఆత్మకూర్(ఎస్) : మండల పరిధిలోని తుమ్మలపెన్‌పహాడ్ గ్రామానికి చెందిన వరికుప్పల సుక్కమ్మ గత పదిరోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. దీంతో శుక్రవారం మృతురాలు కుటుంబానికి ఎన్‌టీఆర్ కాలనీ యూత్ ఆధ్వర్యంలో రూ.20,500 ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా యూత్ అధ్యక్షుడు కొడిదల లక్ష్మణ్ మాట్లాడారు. యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిరుపేదలకు సహాయం చేసినప్పుడే యూత్ లక్ష్యం నెరవేరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వరికుప్పల యల్లయ్య, ఏడుకొండలు, నల్లగొండ వీరన్న, ఓర్సు లింగరాజు, అనిల్‌కుమార్, కనకయ్య, వరికుప్పల వీరేష్, ఓర్సు నరేష్, గణేష్, రవి తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం అందించాలని తహసీల్దార్‌కు వినతి



తిరుమలగిరిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జీఎంపీఎస్ నాయకులు

తిరుమలగిరి : వెలిశాల గ్రామంలో ఎల్లంల సమ్మయ్యకు చెందిన 35 గొర్రెలను వీధి కుక్కలు దాడి చేసి చంపేశాయని, నష్ట పరిహారం అందించాలని తిరుమలగిరి తహసీల్దార్‌కు శుక్రవారం జీఎంపీఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు కడెం లింగయ్య మాట్లాడారు. కుక్కల దాడిలో గొర్రెలు మృతి చెందడంతో రూ.3 లక్షల నష్టపరిహారం జరిగిందని తెలిపారు. ఆయన వెంట కడారి లింగయ్య, సమ్మయ్య, సతీష్, రాములు ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

నూతనకల్ : లింగంపల్లి క్రాస్ రోడ్డు వద్ద తేజస్విన్ త్రీడి బోర్ పాయింట్ డిటెక్టర్స్ ఆధ్వర్యంలో శుక్రవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలు వురు మాట్లాడారు. ప్రతి జీవి జీవనానికి నీరే ఆధారమని తెలిపారు. చలివేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో కాస శంకర్ యాదవ్, రమేష్, పర్వతం హరీష్, మచ్చ మల్లేష్ పాల్గొన్నారు.

ఐడీఏ జిల్లా ప్రధాన కార్యదర్శిగా అరుణ్‌కుమార్



అర్వపల్లి : ఇండియన్ డెంటల్ అసోసియేషన్(ఐడీఏ) సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ చిప్పలపెల్లి అరుణ్‌కుమార్ ఎన్నికయ్యారు. సూర్యాపేటలో శుక్రవారం జరిగిన అసోసియేషన్ సమావేశంలో ఈ ఎన్నికను నిర్వహించారు. నాగారం మండల కేంద్రానికి చెందిన అర్వపల్లి, రామన్నగూడెం ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు చిప్పలపెల్లి ధర్మయ్య-యాకలక్ష్మిల కుమారుడు అరుణ్‌కుమార్ సూర్యాపేటలో అరుణ్ మల్టీస్పెషాలిటీ డెంటల్ ఆస్పత్రిని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్‌కు పలువురు డాక్టర్లు అభినందనలు తెలియజేశారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్‌కు సన్మానం



హైదరాబాద్‌లో నాగరిగారి ప్రీతమ్‌ను సన్మానిస్తున్న యూత్ కాంగ్రెస్ నాయకులు

నాగారం : రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా ఇటీవల నియమితులైన నాగరిగారి ప్రీతమ్‌ను శుక్రవారం మండల యూత్ కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లో శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వల్లాల భానుప్రకాశ్, బొడ్డు నవీన్, బాషమల్ల సందీప్ తదితరులు పాల్గొన్నారు.